## క్లుప్తంగా

### కేంద్ర బృందం పర్యటన

కూసుమంచి: మండలంలోని పెరికసింగారంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న పథకాలను ఎన్ఎల్ఎం(నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్) బృందం మంగళవారం పరిశీలించింది. అంగన్వాడీ కేంద్రాలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలు, సీసీ రోడ్లను పరిశీలించడమేకాక ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు, గ్రామ సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ బృందంలో డాక్టర్ డీ.డీ.గరుడ, ఏ.అశ్విన్ గోపాల్ ఉండగా, ఏపీడీలు చలపతిరావు, శ్రీదేవి, డీఎల్పీఓ రాంబాబు, ఎంపీడీఓ రాంచందర్రావు, ఏపీఓ అప్పారావు, ఏపీఎం తిరుమలరావు పాల్గొన్నారు.

### కాంగ్రెస్లో చేరిక

కామేపల్లి: మండలంలోని జాస్తిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు తోటకూరి శివయ్య ఆ పార్టీని రాజీనామా చేసి కాంగ్రెస్లో చేరారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్లో కాంగ్రెస్లో చేరిన ఆయనకు తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు గుజ్జర్లపూడి రాంబాబు, ఏపూరి మహేందర్కుమార్ పాల్గొన్నారు.

### ఘనంగా సినారె జయంతి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: సాహిత్య విశ్వంభరుడు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, తెలంగాణ నిలువెత్తు కవితా సంతకం డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతిని నగరంలోని ఎస్ఆర్బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సాహిత్య సృజన, పరిశోధనా మార్గాన్ని ఈ తరం విద్యార్థులకు పరిచయం చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ పి.రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ జె.అనురాధ, కోటమ్మ, కిరణ్, ఎం.వీ.రమణ, కె.కార్తీక్ పాల్గొన్నారు.

### నానో యూరియాపై అవగాహన

కామేపల్లి: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకొని తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలని ఏఓ భూక్యా తారాదేవి అన్నారు. మంగళవారం కొమ్మినేపల్లి, ముచ్చర్ల, గోవింద్రాల గ్రామాల్లో రైతులకు పత్తి పంటలో నానో యూరియా, డీఏపీ ఉపయోగం, వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ మేనేజర్ నాగార్జున, శ్యాంసుందర్రెడ్డి, చిత్తరంజన్దాస్, ఏఈఓ భాస్కర్, దీపక్రెడ్డి, ఉష,రైతులు పాల్గొన్నారు.

# ఇక్కడ ఉండలేం..

పేరుకే కాలనీ.. ఆపై అన్నీ సమస్యలే. కాలనీలో కనీస సౌకర్యాలు లేక సమస్యలు తాండవం చేస్తున్నాయి. గత 12 ఏళ్లుగా తాగునీటి వసతి లేక, మట్టిరోడ్లు, మురుగు నిల్వలతో స్థానికులు సహవాసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. తమ కాలనీ సమస్యలు తీరడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్నా.. తమ సమస్యలపై ఎవరూ దృష్టి సారించడం లేదని మండిపడుతున్నారు.


ఇళ్ల మధ్యే నిలిచిన మురుగు


బురదమయంగా అంతర్గత రహదారి

**విద్యానగర్ కాలనీలో తాండవిస్తున్న సమస్యలు**

- 12 ఏళ్లుగా అభివృద్ధి శూన్యం
- డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్యే మురుగు
- రహదారి, నీటి సౌకర్యం లేక అవస్థలు
- పన్నులు చెల్లిస్తున్నా.. కనీస సౌకర్యాలు కరువు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురం సమీపాన కైకొండాయిగూడెం పరిధిలోని విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇక్కడ సుమారు గత 12 ఏళ్లుగా నివసిస్తున్న వెయ్యి మందికి పైగా జనాభాతో కూడిన 350 కుటుంబాలు మట్టి రోడ్లు, మురుగు నీరు, తాగునీటి కొరతతో నానా అవస్థలు పడుతున్నారు. ఇంటి పన్నులు చెల్లిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఓట్ల సమయాన మాత్రమే తాము గుర్తుకొస్తామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**బురదలో బతుకులు**

విద్యానగర్ కాలనీలో అంతర్గత రహదారులన్నీ మట్టిరోడ్లతో ఉండడంతో వర్షాకాలంలో నర(డ)క యాతన అనుభవిస్తున్నారు. రోడ్లపై నిలిచిన నీటిలో వాహనదారులు, బాటసారులు జారిపడి గాయాల పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**డ్రెయినేజీ అస్తవ్యస్తం..**

కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇంట్లో వాడిన నీరంతా ఇళ్ల చుట్టూ నిలిచి, దుర్వాసనతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. వర్షాకాలంలో వాననీటితో పాటు మురుగునీరు చేరి తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దగ్గర్లో ఏర్పడిన రియల్ ఎస్టేట్ వెంచర్ల మూలంగా వర్షపు నీరు బయటకి వెళ్లే మార్గాలు లేకుండా పోయాయని స్థానికులు వాపోతున్నారు.

**జాడలేని మిషన్ భగీరథ నీరు..**

కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. బోర్లు వేయించినా నీరు రాకపోవడంతో ప్రజలు పూర్తిగా మోటార్లపై ఆధారపడుతున్న పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులు వేయించినా 70 శాతం ఇళ్లకు నీరు చేరడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి దీపాల సంఖ్య కూడా తక్కువగా ఉండడంతో రాత్రి సమయాన బురద రోడ్లు ప్రమాదకరంగా మారాయి.

**అభివృద్ధికి ఆమడదూరం..**

విద్యానగర్ కాలనీలోని 1, 2, 4వ డివిజన్లలో 1వ డివిజన్ పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినది కాగా మిగతా రెండు డివిజన్లు ఖమ్మం కార్పొరేషన్ కిందకు వస్తాయి. దీంతో ఇటు ఖమ్మం ఎమ్మెల్యే, అటు పాలేరు నియోజకవర్గ నాయకులు ఎవరూ పట్టించుకోక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు తిష్ట వేశాయి. ప్రభుత్వాలు మారుతున్న తమ సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని, ఓట్ల సమయాన మాత్రమే తాము గుర్తుకొస్తామని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు పట్టించుకుని కనీస సౌకర్యాలైన డ్రెయినేజీ, రహదారి, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**సంతకాల సేకరణ..**


సంతకాల సేకరణలో కాలనీవాసులు

సమస్యల పరిష్కారం కోసం కాలనీకి చెందిన హైస్కూల్ హెచ్ఎం బండి నరసింహారావు నేతృత్వాన స్థానికులు ముమ్మర సర్వే చేపడుతున్నారు. ఉపాధ్యాయుడు జీవీ నాగమల్లేశ్వరరావు, ఆర్అండ్బీ ఉద్యోగి ఎస్.కే. రబ్బానీ, సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ నాయకుడు జె.లెనిన్ తదితరులు కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించేందుకు సంఘటితంగా సిద్ధమవుతున్నారు.

**సంఘటిత పోరాటం..**



మా కాలనీ సమస్యల పరిష్కారం కోసం అంతా ఒకటై ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కాలనీ సమస్యలపై సర్వే ప్రారంభించి సంతకాల సేకరిస్తున్నాం. అధికారులు, పాలకులు స్పందించకుంటే సంఘటితంగా పోరాటం చేస్తాం.

– బండి నరసింహారావు, నివాసి

**సమస్యలు పరిష్కరించాలి..**



ఇళ్ల చుట్టూ మురుగు నీరు దోమలతో జ్వరాల బారిన పడుతున్నాం. పన్నులు కడుతున్నా మౌలిక వసతులు కల్పించడం లేదు. ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించకుంటే కాలనీ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

– ఎస్కె.రబ్బాని, నివాసి

# చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు..


మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేఎంసీలోని సమావేశ మందిరంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్కుమార్తో కలిసి శానిటరీ ఇన్స్పెక్టర్లతో చెత్త సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ల వారీగా డివిజన్లలో చెత్త సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ప్రైవేటు ఆటోల డ్రైవర్లు చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అవసరమైతే ఆయా డివిజన్లకు కార్పొరేషన్ వాహనాలను పంపించాలని ఆదేశించారు. కొన్ని డివిజన్లలో రూ.50 నుంచి రూ.100లు వరకు వసూలు చేస్తున్నారని, నగరమంతటా ఒకే ధర వసూలు చేసేలా చూడాలన్నారు. రోడ్ల వెంట చెత్త కనిపిస్తే శానిటేషన్ అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ సూపర్వైజర్ ఎం.సాంబయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పర్యవేక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పార్కుల అభివృద్ధి పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పర్యవేక్షించారు. 54వ డివిజన్లో నూతనంగా అభివృద్ధి చేస్తున్న పార్కును సందర్శించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలకు ఆట వస్తువులు, పెద్దలకు ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలను నాణ్యతతో త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈఈ కృష్ణాలాల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం


పూజలు చేస్తున్న రాంచందర్రావు, నాయకులు

కూసుమంచి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యాక తొలిసారి మంగళవారం జిల్లాకు వచ్చిన నారపురాజు రాంచందర్రావుకు జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్గూడెం వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా కూసుమంచి శివాలయానికి చేరుకున్న రాంచందర్రావు శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్క నాటాక ఆయన మాట్లాడారు. కూసుమంచితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, బాల్యంలో సెలవులకు ఇక్కడి బంధువుల ఇంటికి వచ్చినప్పుడు శివాలయాన్నీ సందర్శించానని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్రెడ్డి, నాయకులు గల్లా సత్యనారాయణ, తాండ్ర వినోద్రావు, నున్నా రవి, గద్దం వెంకటేశ్వర్లు, పుణ్యవతి, మల్లారెడ్డి, ఉపేందర్రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**సన్మానించిన కార్పొరేటర్**

ఖమ్మంఅర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్రావును ఏడో డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ సన్మానించారు. ఈ సందర్భంగా రామచందర్రావుకు గొంగళి, మేక పిల్లను బహూకరించారు. నాయకులు పుల్లారావు యాదవ్, అల్లిక అంజయ్యయాదవ్, వేల్పుల సుధాకర్, రేఖ సత్యనారాయణ, ధనియాకుల వెంకటనారాయణ, వాగదాని రామకృష్ణ, మేకల మల్లేష్ పాల్గొన్నారు.

### పెంపుడు జంతువుల దుకాణాల తనిఖీ

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని పెంపుడు జంతువుల దుకాణాల(పెట్ షాప్స్)ను మంగళవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ తనిఖీలు చేసింది. స్థానిక పాకబండబజార్ పశువైద్యాధికారి డాక్టర్ క్రాతికుమార్ ఆధ్వర్యాన పశువైద్య శాఖ ఉద్యోగుల బృందం పెంపుడు జంతువుల దుకాణాలు, డాగ్ బ్రీడింగ్, మార్కెటింగ్ కేంద్రాలు, వాటి అనుమతులను తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇచ్చారు. పెట్షాప్, డాగ్ బ్రీడింగ్ కేంద్రాల నిర్వాహకులు రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు నుంచి అనుమతి తీసుకోవాలని, పెంపుడు జంతువుల, పక్షులు తదితర వాటికి రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇవ్వలేదని ఫిర్యాదు

రఘునాథపాలెం: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును అందించకుండా ఉంచిన విషయమై.. మండలంలోని రాంక్యాతండాకు చెందిన జాటోత్ లచ్చు మంగళవారం ఖమ్మం జిల్లా డీఆర్ఓ ఎ.పద్మశ్రీకి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా లచ్చు మాట్లాడుతూ.. తాను రూ.4లక్షలతో మోకాళ్ల సర్జరీ చేయించుకుని 2024 ఆగస్టులో మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్కు దరఖాస్తు చేసుకోగా చెక్కు విషయమై గ్రామానికి చెందిన వెంకన్నను చాలాసార్లు అడిగితే సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. దీంతో ఇటీవల హైదరాబాద్ సచివాలయానికి వెళ్లి అడుగగా.. ఈ ఏడాది మార్చి 21న రూ.60 వేలు మంజూరైనట్లు తెలిపారన్నారు. ఆతర్వాత మంత్రి క్యాంపు కార్యాలయంలో అడిగితే వెంకన్న తీసుకున్నాడని తెలియజేశారని డీఆర్ఓకు వివరించారు. ప్రస్తుతం ఆ చెక్ గడువు ముగిసినందున తనకు న్యాయం చేయాలని కోరారు.

### బ్యాగ్లు, నోట్ పుస్తకాల పంపిణీ

ఖమ్మం సహకారనగర్: పేద విద్యార్థులకు జీఎస్ఎస్ గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బిషప్ జాకబ్ నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 1,100 మంది విద్యార్థులకు బ్యాగ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణ చేసినట్లు ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి తెలిపారు. మంగళవారం నగరంలోని రాజేంద్రనగర్, సంభానినగర్, సుందరయ్యనగర్, బీకే బజార్, ఇందిరానగర్, అల్లీపురం, కొత్తగూడెం, కొత్తూరు, అగ్రహారం తదితర పాఠశాలల్లో అందించారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, సిబ్బంది కృష్ణకుమారి, కె. వెంకటేశ్వర్లు, ఏపీపీసీ చైర్మన్ మహేశ్వరీ, డాన్‌బాస్కో తదితరులు పాల్గొన్నారు.

**పాండురంగాపురంలో రేషన్ కార్డులు..**

ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను 2వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు నర్సింహారావు, శ్రీనివాసరావు, మల్లేశం, సురేశ్, భద్రయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు

కూసుమంచి: వ్యవసాయాన్ని విచ్ఛిన్నం చేసేందుకే ప్రధాని మోదీ ప్రభుత్వం తప్పుడు విధానాలను అవలంబిస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మోదీ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. అనంతరం రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడాక కూసుమంచి మండల వ్యవసాయ, కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తోటకూరి రాజశేఖర్, చిట్టూరి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, నాయకులు శీలం గురుమూర్తి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పొన్నెకంటి సంఘయ్య పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి


ముచ్చర్ల పీహెచ్సీలో తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈఓ

కామేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించి, ప్రజల మన్ననలు పొందాలని డిప్యూటీ సీఈఓ నాగపద్మజ అన్నారు. మంగళవారం కామేపల్లి పీహెచ్సీతో పాటు ముచ్చర్ల, జాస్తిపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్సీలకు వచ్చే వారికి అన్ని రకాల వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ముమ్మరంగా ఫీవర్ సర్వే చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ నరేంద్రనాయక్, సూపరింటెండెంట్ నరేందర్, ఏఎన్ఎం అరుణ, హేమలత, మీనా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్గా యామిని

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్గా యామిని మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్చార్జ్గా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భూపాల్ ఉన్నారు. వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్గా పని చేస్తున్న ఆమె ఇక్కడకు రాగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**● పీవైఎల్ రాష్ట్ర కమిటీలో స్థానం**


ప్రేమ్సింగ్

రఘునాథపాలెం: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రఘునాథపాలెం మండలం రాంక్యాతండాకు చెందిన జాటోత్ ప్రేమ్సింగ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా ప్రేమ్ను పలువురు అభినందించారు.

**● ఖమ్మం టౌన్ విద్యుత్ ఇన్చార్జ్ డీఈగా బాబూరావు**

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం టౌన్ విద్యుత్ ఆపరేషన్ ఇన్చార్జ్ డివిజనల్ ఇంజనీర్(డీఈ)గా బాబూరావుకు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ రెగ్యులర్ డీఈగా పనిచేస్తున్న నంబూరి రామారావు సెలవుపై వెళ్లడంతో ఖమ్మం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ డీఈగా పనిచేస్తున్న బాబూరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఆదివారం వరకు బాధ్యతలు ఉంటాయని సమాచారం.

**● దూదేకుల సంఘ ఖమ్మం నగర అధ్యక్షుడిగా అన్వర్ పాషా**


అన్వర్ పాషా

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర నూర్బాష దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షుడిగా ఖమ్మం గట్టయ్యసెంటర్కు చెందిన అన్వర్ పాషా నియమితులయ్యారు. మంగళవారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడేసాహెబ్, జిల్లా అధ్యక్షుడు షేక్.సలీం ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ లతీఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మీరా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ కలాం, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అన్వర్ పాషాలతో పాటు షేక్ మీరాసాహెబ్, షేక్ మౌలాలి, సుభాని పాల్గొన్నారు.

### పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి రాజీవ్ ట్రోఫీ క్రికెట్ పోటీల పోస్టర్లను మంగళవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సంఘం ఆధ్వర్యాన పోటీలు నిర్వహించనున్నట్లు బాధ్యులు జాఫర్ మతీన్, శ్రీకాంత్, టీ.వీ.అప్పారావు, సూరిబాబు తెలిపారు. ఈమేరకు ఆగస్టు 5 నుంచి జిల్లా వ్యాప్తంగా పోటీలు జరుగుతాయని వెల్లడించారు.

## సంక్షిప్తంగా..

**☛ ఆయిల్ పామ్తో అధిక లాభాలు**


ఆయిల్పామ్ తోటలో ఉద్యాన అధికారి, తదితరులు

తిరుమలాయపాలెం: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా లాభాలు సాధించొచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. మండలంలోని పిండిప్రోలులో పలువురు రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఒకసారి ఆయిల్పామ్ నాటితే 30 ఏళ్ల వరకు ఆదాయం ఉంటుందని, కోతులు, ప్రకృతి వైపరీత్యాల బెడద ఉండదని తెలిపారు. అనంతరం తెట్టెలపాడు, పిండిప్రోలు, తాళ్లచెరువు, ఏలువారిగూడెం, రాజారంల్లో ఆయిల్పామ్, బొప్పాయి, అరటి, కూరగాయలు, బంతి పూల తోటలను పరిశీలించడమే కాక మిరప నర్సరీలను తనిఖీ చేశారు. పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి అపర్ణ,గోద్రెజ్ కంపెనీ సిబ్బంది లక్ష్మణ్రావు,అజయ్కుమార్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

**☛ ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం**

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజా ఉద్యమాలతోనే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (మార్క్సిస్టు-లెనినిస్టు) యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యాన భారత విప్లవ పంథా నిర్మాతలు, అమరులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, శిష్యా విజయ్శర్మల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఒక నిమిషం మౌనం పాటించారు. భూమి సమస్యలపై పోరాడుతున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులందరి ఐక్యతతో పోరాటాలు సాగిస్తామన్నారు. యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీ నాయకుడు కె.ఎర్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందరావు మాట్లాడగా.. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండా లింగయ్యలతో పాటు ముత్తయ్య, బాణాల లక్ష్మణాచారి, కల్తి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**☛ గుండెపోటుతో హోటల్ యజమాని మృతి**

ఖమ్మంఅర్బన్: డోర్నకల్ మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన రెడ్డెబోయిన నర్సయ్య (49) రఘునాథపాలెంలో నివసిస్తూ పాండురంగాపురంలో భోజన హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన నర్సయ్య మంగళవారం ఉదయం హోటల్కు వచ్చి వంట పనులు చేస్తుండగా.. మంగళవారం గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**☛ ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం**


నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దయాకర్రెడ్డి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయ నూతన పాలకవర్గ బాధ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ ఐతనబోయిన శ్రీనివాసరావు, సభ్యులుగా సురేందర్, శ్రీను, నాగయ్య, యామిని, రామకృష్ణ , వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయగా పలువురు సన్మానించారు. అనంతరం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్రెడ్డి మాట్లాడుతూ కొత్త పాలకవర్గం ఆలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, బొందయ్య, నాగరాజు, రాంబ్రహ్మం, జాన్రెడ్డి, శంకర్, వాకా శ్రీనాథ్, వెంకటేష్, మల్లయ్య, బాబురెడ్డి, నరేష్, బ్రహ్మం, రవి పాల్గొన్నారు.

**☛ పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలి**

ఖమ్మంలీగల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడిని వెంటనే నిలిపివేయాలని న్యాయవాద సంఘాల నాయకులు కోరారు. ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా మంగళవారం జిల్లా కోర్టులో ఐలు, ఐఏఎల్, సీఎల్సీ, అడ్వకేట్ జేఏసీ, హెచ్ఆర్ఎఫ్ సంఘాలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బిచ్చల తిరుమలరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, శేషగిరిరావు, మీసాల వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి విజయ్, ఖాదర్ బాబా, విప్లవకుమార్, సుగుణరావు మాట్లాడుతూ.. ఈ దాడుల వల్ల గాజాలో ప్రజలకు నీరు, ఆహారం, మందులు, నిత్యావసరాలు, విద్యుత్ అందక దుర్భర జీవనం గడుపుతున్నారన్నారు. పాలస్తీనా సంఘీభావ కమిటీ, ప్రత్యామ్నాయ పౌర సమూహం ఆధ్వర్యాన వచ్చే నెల 7న ఖమ్మంలో జరిగే ర్యాలీకి మద్దతు తెలియజేస్తూ న్యాయవాదులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జంపాల విశ్వ, పావెల్,జానీ, రామాంజనేయులు, కె.శ్రీను, ఎ.వెంకటేశ్వర్లు, రామయ్య, నారాయణ, రాము, లింగన్న, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

**☛ ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం**

ఖమ్మంలీగల్: మహిళలు, పిల్లలు, ప్రజా భద్రతకు సంబంధించిన కేసులను భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) 2023లోని సెక్షన్ 35(3)లో మినహాయించాలని లోక్సభలో ఎంపీ రఘురాంరెడ్డి తన గొంతు వినిపించినందుకు మంగళవారం రఘురాంరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఖమ్మం బార్ అసోసియేషన్ న్యాయవాదులు న్యాయస్థాన ప్రాంగణంలో ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్, పసుపులేటి శ్రీనివాస్, స్వామి రమేష్, న్యాయవాదులు శ్రీనివాస్నాయుడు, ఊటుకూరి విజయలక్ష్మి, సైదేశ్వరరావు, క్రిస్టఫర్, వెంకట్ నారాయణ, శ్రీనివాస్, దీపిక, కృష్ణారావు, ముల్పూర్, సురేష్, ప్రవీణ్, కె.రవి, లాల్జాన్పాషా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

**☛ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి**

తిరుమలాయపాలెం: సాదాబైనామాలో దరఖాస్తు చేస్తున్న రైతులకు పట్టాదారు పాస్పుస్తకాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ మాదిరిగానే భూముల క్రమబద్ధీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పేరుతో మాటలకే పరిమితమైందన్నారు. ఇప్పటికైనా భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు అచ్చా ఉప్పలయ్య, పోలిపొంగు నాగయ్య, వీరస్వామి, వెంకటేశ్వర్లు, షబ్బీర్, శ్రీకాంత్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

**☛ దంత వైద్యశిబిరం**

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. మమత దంత వైద్యశాల నిపుణులు ప్రొఫెసర్ బి.వెంగళరావు హాజరై మాట్లాడుతూ.. దంతాల సంరక్షణకు నోటి పరిశుభ్రత అవసరమన్నారు.

# నాగేంద్రుడికి పూజలు..


పుట్టలో పాలు పోస్తున్న మహిళ

నాగుల పంచమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేసి దేవాలయాలు, పుట్టల్లో పాలు పోసి తమ కోర్కెలను నెరవేర్చాలని వేడుకున్నారు. పుట్టలను పసుపు, కుంకుమతో అలంకరించారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్


నాగేంద్రుడికి నమస్కరిస్తున్న భక్తురాలు


నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు